క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంఈఓతో ఇబ్బందులు

పెద్దకొత్తపల్లి: మండలానికి 8 సంవత్సరాల నుంచి ఇన్‌చార్జ్ ఎంఈఓ ఉండటంతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. 8 సంవత్సరాల కిందట ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన శ్రీనివాసులు బదిలీపై తిమ్మాజిపేటకు వెళ్లారు. పెద్దకొత్తపల్లికి ఇన్‌చార్జ్ ఎంఈఓగా తెలకపల్లి ఎంఈఓ చంద్రుడికి బాధ్యతలు అప్పగించారు. ఆయనకు పెద్దకొత్తపల్లితో పాటు అచ్చంపేట, కొల్లాపూర్, 8 మండలాలు ఇన్‌చార్జ్ ఉండటంతో పాఠశాలల పర్యవేక్షణ కొరవడింది. దీంతో పాఠశాలల్లో విద్యాబోధన అస్తవ్యస్తగా మారింది. మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ కొరవడటంతో భోజనాన్ని నాణ్యతగా అందించడం లేదు. జిల్లా అధికారులు పట్టించుకుని రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు లింగస్వామి, రాములు, లక్ష్మయ్య కోరారు.

నేడు విజయోత్సవ ర్యాలీ

తెలకపల్లి: ఎమ్మెల్యేగా కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి తొలిసారి నియోజకవర్గానికి వస్తుండటంతో సోమవారం తిమ్మాజిపేట మండలం మరికల్ మీదుగా నాగర్‌కర్నూల్ వరకు ర్యాలీ నిర్వహిస్తునట్లు కాంగ్రెస్ గౌరారం గ్రామ అధ్యక్షుడు రాజారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

ఎల్లికట్టవాసికి పీస్ ఇంటర్నేషనల్ అవార్డు



కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన వేణుగోపాల్‌కు మహాత్మా గాంధీ పీస్ ఇంటర్‌నేషనల్ అవార్డు 2023 దక్కింది. యువతేజం కలాం విజన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ఉన్న సిటీ కల్చరల్ సెంటర్‌లో అవార్డును ఆయన అందుకున్నారు. సినీ డైరెక్టర్, ప్రొడ్యూసర్ శ్రీనివాసులు హైదరాబాద్ కోర్టు సూపరింటెండెంట్ అంజనీకుమారీ, యువతేజం వ్యవస్థాపక అధ్యక్షుడు కరీముల్లా అవార్డు అందజేశారు. మన సేవా సమితి స్థాపించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించామని వేణు తెలిపారు. ఈ సందర్భంగా వేణును సైదులు, నాగిరెడ్డి, శివాజీ తదితరులు అభినందించారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం



చారకొండ: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జూపల్లి వెంకటయ్య యాదవ్, ముజ్జుబాయి, నాయకులు సిరాజ్, శ్రీనివాస్ గౌడ్, రాజు యాదవ్ కల్వకర్తిలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, నాయకులు లింగం, రామచంద్రి, మల్లయ్య, వెంకటయ్య, జంగయ్య, తదితరులు ఉన్నారు.

వెల్దండ: కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాదులో ఆయన నివాసంలో పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే గెలుపొందడంతో సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్, గోపాల్‌నాయక్, నర్సింగ్‌నాయక్,రామస్వామి, శంకర్‌నాయక్, రవీందర్‌రావు తదితరులు ఉన్నారు.

పోటెత్తిన భక్తులు



పెద్దకొత్తపల్లి: భక్తుల ఇలవేల్పు నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శించుకునేందుకు ఆదివారం హైదరాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, పెబ్బేరు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రైతులు, వ్యవసాయ కూలీలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కొందరు అక్కడే చెట్ల కింద వంటలు చేసుకొని ఆరగించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ రకాల దుకాణాల వద్ద వస్తువులను కొనుగోలు చేస్తూ సందడి చేశారు.



‘ప్రజావాణి’ అమలయ్యేనా?

- హాజరుకాని అధికారులు
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తున్న కింది స్థాయి అధికారులు
- కొత్త ప్రభుత్వంలోనైనా సమస్యలు పరిష్కారమవుతాయా అని వేచిచూస్తున్న బాధితులు



లింగాల మండల కేంద్రంలో ప్రజావాణి నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

అచ్చంపేట రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే ‘ప్రజావాణి’ కార్యక్రమం కొత్త ప్రభుత్వంలోనైనా పకడ్బందీగా అమలవుతుందా అని ప్రజలు వేచి చూస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు అన్ని శాఖల అధికారులు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలనే ఉన్నతాధికారుల ఆదేశాలను కింది స్థాయి అధికారులు, సిబ్బంది బేఖాతరు చేశారు. స్థానికంగా ఉండని వివిధ శాఖల అధికారులు వివిధ ప్రాంతాల నుంచి సోమవారం హడావుడిగా తహసీల్దార్ కార్యాలయాలకు ఆలస్యంగా వచ్చేవారు. మరికొందరు అధికారులు డుమ్మా కొట్టేవారు. ఇంకొందరు కింది స్థాయి సిబ్బందిని పంపించి చేతులు దులుపుకొనేవారు. ఉన్నతాధికారులు ఫోన్ చేసి ప్రజావాణికి ఎందుకు హాజరుకాలేదని అడిగితే ఫీల్డ్‌లో ఉన్నామని తప్పించుకునేవారు. దీంతో ప్రజలకు ప్రజావాణిపై నమ్మకం పోయింది. మండల స్థాయిలోనే ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్నామని అధికారులు గ్రామీణ స్థాయిలో ప్రచారం చేయకపోవడంతో చాలామంది ప్రజలు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికే ఎక్కువ మంది వెళ్లేవారు. అక్కడ కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ప్రజలు కుంగిపోయేవారు.

ప్రజాదర్బార్‌కు ఆదరణ...

ఇటీవలి కాలంలో రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ప్రమాణ స్వీకారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి మరుసటి రోజే ప్రజాభవన్‌లో ప్రజాదర్బార్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని నలుమూల నుంచి భారీ ఎత్తున సమస్యలు చెప్పుకోవడానికి వెళ్లిన సంగతి తెలిసిందే. గతంలో మండల, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదని దీన్ని బట్టి తెలుస్తోంది. దీంతో మండలంలో నిర్వహించే ప్రజావాణికి ఫిర్యాదులు కరువయ్యాయి. ఒకటి, రెండు ఫిర్యాదులతో సరిపుచ్చుకున్నారు. కొన్ని మండలాల్లో నిర్వహించే ప్రజావాణికి అసలు ఒక్క ఫిర్యాదు కూడా రాని రోజులు ఉన్నాయి. దీనిబట్టి చూస్తే అధికారులు ఏ స్థాయిలో పనిచేస్తున్నారో అర్థమవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక్క రోజు సెలవు ఉంటే చాలు అధికారులు ఒకరోజు ముందే విధులకు డుమ్మాకొడుతున్నారు. డుమ్మా కొట్టే అధికారులంతా వేరే పట్టణాల్లో స్థిరపడి రోజువారీగా విధులకు హాజరవుతున్నవారే ఉన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా నామమాత్రంగా ఉండటంతో కింది స్థాయి ఉద్యోగులు ఇలా ప్రవర్తించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. డివిజన్ కేంద్రమైన అచ్చంపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ హాజరైనా మండల స్థాయి, వివిధ శాఖల అధికారులు హాజరు కాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపించేవారు. హాజరు కాని, నిర్లక్ష్యం వహించే అధికారులకు మెమోలు జారీ చేసినా పట్టించుకోలేని పరిస్థితి ఉండేది. కొత్త ప్రభుత్వంలో అధికారులు ఎలా పని చేస్తారోనని ప్రజలు అనుకుంటున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌లో ఆదివారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి, శివపార్వతులు, ధ్వజస్తంభం, నవగ్రహాలు, గణపతి, సుబ్రహ్మణ్యం, నందీశ్వర, నాగదేవతా విగ్రహాలను ఆదివారం ప్రతిష్ఠించారు. ఫుడ్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమంలో దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బైరెడ్డి శంకరమ్మ, కిష్టారెడ్డిల జ్ఞాపకార్థం వారి పెద్ద కుమారుడు బాల్‌రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో 200 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కొల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యమివ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తారాసింగ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు ఇతర అంశాలపై కూడా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధ్యాయుల కొరత ఉందని, నాణ్యమైన భోజనం అందడం లేదని పేర్కొన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రోడ్లపైనే మురుగు

పెద్దకొత్తపల్లి: మండలంలోని చినకొత్తపల్లిలో మురుగుకాల్వలు లేక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్సీ, బీసీ కాలనీలలో సీసీ రోడ్లు వేసి పక్కన కాల్వలు నిర్మించలేదు. రోడ్లపైనే మురుగు ప్రవహిస్తోంది. దీంతో గ్రామస్తులు రోడ్లపై నడవలేని దుస్థితి నెలకొంది. మురుగుతో పాటు మిషన్ భగీరథ నీరు తోడుకావడంతో రోడ్లు బురదమయంగా మారాయి. కంపువాసన భరించలేకపోతున్నామని గ్రామస్తులు వాపోయారు. అధికారులు స్పందించి మురుగుకాల్వల నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



‘మహాలక్ష్మి’తో మహిళా సాధికారత



అవగాహన కల్పిస్తున్న ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: మహాలక్ష్మి పథకం మహిళా సాధికారతకు ఎంతో మేలు చేస్తుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని తాండ్రలో మహిళలతో కలిసి మహాలక్ష్మి పథకం లోగోను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకంపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అభిష్టారెడ్డి, మహిళలు, కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ఉప్పునుంతల: మండలంలోని దాసర్లపల్లిలో ఆదివారం త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నాగర్‌కర్నూల్, అచ్చంపేట కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపేందుకు, ప్రజల మధ్యన ఉన్న అసమానతలను తొలగించేందుకు భగవద్గీత గ్రంథాలు దోహదపడుతాయని వివరించారు. ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నాగర్‌కర్నూల్, అచ్చంపేట కమిటీల అధ్యక్షుడు మనోహర్, సాయిశంకర్ శ్రేష్టి, నిరంజన్, నరసింహా, వెంకటమ్మ, రమాదేవి, స్వప్న, చంద్రకళ, కృష్ణవేణి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక వన భోజనాలు



కల్వకుర్తిలో పూజలు చేస్తున్న మహిళలు



దోమలపెంటలో..

కల్వకుర్తి రూరల్: కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం ఆటపా అధ్యక్షుడు పాపి శెట్టి సతీష్ ఆధ్వర్యంలో వన భోజనాలు నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టు కింద ప్రత్యేక పూజలు చేశారు. మహిళలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం వనభోజనాలు చేసి సందడి చేశారు. కార్యక్రమంలో శోభన్ బాబు, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి రమేష్, కోశాధికారి శివ, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని జూపల్లి హనుమాన్ దేవాలయంలో ఆకు పూజ చేశారు. అంతకుముందు గ్రామానికి చెందిన కొండల్ గౌడ్ నివాసంలో చెట్టు కొమ్మకు పూలు, దీపాలను అలంకరించి భక్తిగీతాలను ఆలపిస్తూ దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి అభిషేకం నిర్వహించారు. తిరుపతాచారి, వెంకయ్య గౌడ్, కొండల్, శ్రీను, భాస్కర్, చంద్రయ్య ఉన్నారు.

దోమలపెంట: కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక రామాలయంలో ఆదివారం గ్రామస్తులు ఉసిరి చెట్టు కింద వన భోజనాలు చేశారు. అంతకుముందు మహిళలు సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మాధవచారి, ఎంపీటీసీ మల్లికార్జున, సర్పంచ్ శారద పాల్గొన్నారు.

అద్దె భవనంలో గ్రామ పంచాయతీ భవనం



కోడేరు: మండలంలో నూతనంగా ఏర్పడిన రేకులపల్లి గ్రామపంచాయతీ అద్దె భవనంలో కొనసాగుతుంది. ప్రతినెలా గ్రామసభ సమావేశాలు నిర్వహించాలన్నా ఒకే గదితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వార్డు సభ్యులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామపంచాయతీ కార్యాలయానికి నిధులు మంజూరు చేసి సొంత భవనం ఏర్పాటు చేయాలని వార్డుసభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సీఎంను కలిసిన జెడ్పీటీసీ సభ్యుడు



వంగూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివారం జెడ్పీటీసీ సభ్యుడు, పీసీసీ అధికార ప్రతినిధి కేవీఎన్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. కొండారెడ్డిపల్లి గ్రామానికి రావాలని ఆహ్వానించారు. త్వరలో గ్రామానికి వస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు జెడ్పీటీసీ పేర్కొన్నారు. ఆయన వెంట కేవీఎస్‌రెడ్డి పేర్కొన్నారు.

ఏటీఎం లేక వినియోగదారుల ఇక్కట్లు



పెద్దకొత్తపల్లిలో ఉన్న ఏపీజీవీబీ బ్యాంకు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఏటీఎంలేక వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఏటీఎం ఏర్పాటు చేయకపోవడంతో డబ్బులు విత్‌డ్రా చే సుకునేందుకు నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు పనిచేసే రోజులు తప్పా సెలవు దినాల్లో డబ్బులు తీసుకునేందుకు రైతులు, విద్యార్థులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి ఎక్కువ మొత్తం కమీషన్ చెల్లించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆరోపించారు. మండలంలో 2 ఏపీజీవీబీ బ్యాంకులు, ఒక పంజాబ్ నేషనల్ బ్యాంకు ఉంది. మండల కేంద్రంలో ఉన్న ఏపీజీవీబీ బ్యాంకులో 4200 మంది రైతులకు పంట రుణాల కింద రూ.30 కోట్లు, 270 మహిళా సంఘాలకు రూ.11 కోట్ల రుణాలు ఇచ్చారు. బ్యాంకులో 20 వేల సేవింగ్ ఖాతాలు ఉన్నాయి. కల్వకోలు ఏపీజీవీబీ బ్యాంకులో 3100 రైతుల ఖాతాలు ఉన్నాయి. రూ.36 కోట్ల పంట రుణాలు ఇచ్చారు. 160 మహిళా సంఘాలకు రూ.12 కోట్ల రుణాలను అందజేశారు. మొత్తం 12 వేల సేవింగ్ ఖాతాలు ఉన్నాయి. ఈ బ్యాంకు పరిధిలోని గ్రామాలు కల్వకోలు, తిరునాంపల్లి, కొండ్రావుపల్లి, చెన్నపురావుపల్లి గ్రామాలు ఉన్నాయి. పెద్దకొత్తపల్లి ఏపీజీవీబీ బ్యాంకు పరిధిలో పెద్దకొత్తపల్లి, బాచారం, పసుపుల, ఆదిరాల, వావిళ్ళబావి, నక్కలపల్లి, ముష్టిపల్లి, వెన్నచర్ల, చంద్రకల్, సంజీవాపూర్ గ్రామాలు ఉన్నాయి.

ఏటీఎం మిషన్ ఎత్తుకెళ్లిన దుండగులు

మండల కేంద్రంలో ఉన్న ఇండియన్ 1 ఏటీఎం మిషన్‌తో పాటు రూ.6 లక్షల నగదును సెప్టెంబర్ 3వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అప్పటి నుంచి మండల కేంద్రంలో ఏటీఎం లేక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. నగదుకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి విత్‌డ్రా చేసుకుంటున్నారు.

జాతీయ బ్యాంకును ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో ఎస్‌బీఐ జాతీయ బ్యాంకును ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న ఏపీజీవీబీ బ్యాంకు వల్ల పెద్ద రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నాం. రైతులు, విద్యార్థుల సౌకర్యార్థం అధికారులు బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– సంజీవరావు, జొన్నలబొగుడ

అధికారుల నిర్లక్ష్యంతోనే..



మండల కేంద్రంలో నాలుగు నెలల నుంచి ఏటీఎం సెంటర్ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇండియన్ 1 ఏటీఎం మిషన్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. కొత్తగా ఏటీఎంను ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

–బాలస్వామి, పెద్దకొత్తపల్లి

కాల్వలో జమ్ము తొలగించండి



కొల్లాపూర్ మండలం కుడికిల్లలో ..



కోడేరు కేఎల్ఐ కాల్వలో పెరిగిన జమ్ము

కోడేరు: జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి అధికారులు రైతులకు సాగునీరు వదలడంతో కొంత మంది రైతులకు సాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నారు. కాల్వలో జమ్ము పెరగడంతో నీరు రావడం లేదని వాపోతున్నారు. జమ్మును తొలగించాలని గతంలో అధికారులకు విన్నవించినా కొన్ని గ్రామాల్లో అధికారులు జమ్మును నామమాత్రంగా తొలగించారిన, పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో నీరు రావడం లేదన్నారు. నా అధికారులు స్పందించి కాల్వలో పేరుకుపోయిన జమ్మును తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సాగునీరు రాకపోవడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని కుడికిల్లకి సమీపంలోని కేఎల్ఐ ప్రధాన కాల్వకు అనుసంధానంగా ఉన్న పంటల కాల్వలో వేపుగా పెరిగిన జమ్మును అధికారలు తక్షణమే తొలించాలని కుడికల్ల, ఎల్లూరు గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు. ఎన్నోమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



చైతన్య స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని చైతన్య హైస్కూల్ యాజమాన్యం సెలవు రోజుల్లో తరగతులను నిర్వహిస్తున్నారని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు ఆరోపించారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. రెండో శనివారం, ఆదివారం సెలవుదినాల్లో ఉపాధ్యాయులను ఇంటింటి ప్రచారానికి వాడుకుంటూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తుందని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు రవినాయక్, ఉపాధ్యక్షుడు ఊశన్న ఆవేదన వ్యక్తం చేశారు. సెలవుల్లో పని చేయించుకోవడం ఎంత వరకు సమంజసమని పాఠశాల ఏజీయం భాస్కర్‌రెడ్డిని ప్రశ్నిస్తే ఉద్యోగాలు తీసివేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాఠశాల నిర్వహణపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పర్వతాలు, భాస్కర్, అజాహర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

వంగూరు: అచ్చంపేట ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారిగా నియోజకవర్గానికి వస్తున్న వంశీకృష్ణకు ఆదివారం మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. శ్రీశైలం క్రాస్‌రోడ్డు నుంచి వంగూరు గేట్ వరకు ర్యాలీగా వచ్చారు. వంగూరు గేట్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు మాజీ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లురవి ఉన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాలు, గజమాలతో సన్మానించారు. మండల కేంద్రంలో కొలువుదీరిన గెల్వలాంబ అమ్మవారికి అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనూరాధ ప్రత్యేక పూజలు చేశారు.

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి వచ్చిన అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ను తెలకపల్లి సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ర్యాలీకి తరలిన నాయకులు

లింగాల: అచ్చంపేటలో నిర్వహించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ విజయోత్సవ ర్యాలీకి మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, యువజన మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, పట్టణ అధ్యక్షుడు పూజారి బుడ్డయ్య ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరారు.

చారకొండ: మండలం నుంచి అచ్చంపేట విజయోత్సవ ర్యాలీకి తరలినవారిలో మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, వెంకట్ గౌడ్, నాయకులు శంకర్ గౌడ్, నాగేంద్ర, వెంకటయ్య, శ్రీను, అంజయ్య తదితరులు ఉన్నారు.

మన్ననూర్: అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్వంత మండలం అమ్రాబాద్ నుంచి విజయోత్సవ ర్యాలీకి తండోప తండాలుగా బయలుదేరి వెళ్లారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com